## క్లుప్తంగా

### జేసీబీ ఘటనలో నిందితుడి అరెస్టు

చీరాల: జేసీబీని దగ్ధం చేసిన ఘటనలో నిందుతుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈనెల 27న చీరాల రూరల్ మండలం బోయినవారిపాలెంలో తోటవారిపాలెం పంపింగ్ స్కీమ్ వద్ద జేసీబీని దగ్ధం చేశారు. ఈఘటనలో నిందుతుడు నెల్లూరు జిల్లా సమీరపాలేనికి చెందిన నేతి సతీష్‌ని ఆదివారం అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

### మృతదేహం కోసం గాలింపు చర్యలు

అద్దంకి రూరల్: అద్దంకిలోని గుండ్లకమ్మ వంతెన మీద నుంచి దూకి శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడిన వివాహిత మృతదేహాన్ని ఆదివారం ఉదయం నుంచి అగ్నిమాపక కేంద్రం అధికారులు, పోలీసు అధికారులు నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. నదిలో నీటి ఉధృతి అధికంగా ఉండటంతో సాయంత్రం వరకు వెతికినా మృతదేహం ఆచూకీ లభించలేదు. సోమవారం కూడా నదిలో గాలించనున్నట్లు ఎస్సై ఖాదర్‌బాషా తెలిపారు.

### ప్రాణాలు పోతేగాని పట్టించుకోరా !


ముస్లిం కాలనీకి వెళ్లే రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత

కారంచేడు: నిత్యం రద్దీగా ఉండే రహదారిలో ఉన్న మురుగు కాల్వపై నిర్మించిన కల్వర్టుకు పడిన గుంతను పూడ్చేందుకు పంచాయతీ సిబ్బంది ముందుకు రావడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం కారంచేడు ముస్లిం కాలనీ, ఎస్సీ కాలనీ, ఎస్టీ కాలనీలకు అనునిత్యం ద్విచక్రవాహనాలు, ఆటోలు తిరిగే ప్రధాన రహదారిలో ఈ గుంత ఏర్పడిందని ప్రజలు చెప్తున్నారు. గంటా నాగయ్య రైస్ మిల్లు సమీపంలోని మురుగు కాల్వపై ఈ గుంత ఏర్పడింది. మొదట్లో చిన్న గుంత ఏర్పడిందని, అది క్రమేణా పెద్దదిగా మారిందని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. రాత్రి సమయంలో అయినా, కొత్త వారు వచ్చినప్పుడు అయినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, చిన్న పిల్లలు కూడా ఆడుకుంటూ దానిలో పడినా ప్రాణాలు కూడా పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, పాలకులు ఇప్పటికైనా సమస్యను గుర్తించి వెంటనే పరిష్కరించాలని కాలనీవాసులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

---

మద్యం విక్రయాలకు సంబంధించి ఎవరైనా బెల్టుషాపులు నిర్వహిస్తే బెల్టు తీస్తాం.. ఎవరినీ వదలిపెట్టం చర్యలు తీసుకుంటాం జాగ్రత్త..

సీఎం చంద్రబాబు నాయుడు, అసెంబ్లీలో చెప్పిన మాటలు



- మూడు పుల్లులు ఆరు క్వార్టర్లుగా బెల్టుషాపులు
- మంగళసూత్రాలు సైతం మిగల్చడం లేదంటూ ఆడపడుచుల ఆవేదన
- గుడి, బడి తేడా లేకుండా విచ్చలవిడిగా మద్యం విక్రయాలు
- మామూళ్ల వసూళ్లలో అధికారులు
- నామమాత్రపు కేసులతో సరి

# తాగుదాం.. తాగి ఊగుదాం

యద్దనపూడి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక నాణ్యమైన, విద్య, వైద్యం దొరకక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరోపక్క నాణ్యమైన మద్యం మాత్రం బాగా దొరుకుతుంది. సాక్షాత్తు సీఎం చంద్రబాబు చెప్పిన మాటలకు విలువ లేదంటే మనం అర్థం చేసుకోవచ్చు. గ్రామాల్లో గుక్కెడు నీరు దొరకటం కష్టమేమో కానీ మద్యం మాత్రం నిత్యం అందుబాటులోనే ఉంటుంది. ఇటీవల ప్రభుత్వ మద్య దుకాణాలు పోయి ప్రైవేట్ మద్యం దుకాణాలు రావటంతో కావాల్సిన బ్రాండ్‌లు నిత్యం అందుబాటులో ఉంటున్నాయి. దీనికి తోడు ఎక్కడో దూరంగా ఉన్న షాపుకు వెళ్లి కొనుక్కునేందుకు ఇబ్బంది పడకుండా గుడి,బడి తేడా లేకుండా ప్రతి వీధిలో ఓ బెల్టుషాపులు వెలిశాయి. దీంతో దూరంగా ఉన్న షాపునకు వెళ్లే పనిలేకుండానే రేటు ఎక్కువైనా బెల్టుషాపుల్లో కోరిన మద్యం దొరుకుతుండటంతో మందుబాబులు ఖుషీఖుషీగా ఉంటున్నారు. ఇదే అదునుగా షాపు నిర్వాహకులు బెల్టుషాపులు ఎక్కడ జోరుగా సాగుతున్నాయో తెలుసుకొని వాటిని తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు వ్యాపారులు ప్రయత్నిస్తున్నారు.

**తెల్లవారకముందే మందే..**

గతంలో తెల్లవారకముందే పొలం వెళ్లే రైతులు, వ్యవసాయ కూలీలు సెంటర్‌లోనో, ఇంట్లోనో టీ తాగి పనికి వెళ్లే వారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో టీ దుకాణాల కంటే ముందుగానే బెల్టు దుకాణాలు తెరుచుకుంటున్నాయి. దీంతో టీకి బదులు మద్యం తాగి పనులకు వెళ్తున్న పరిస్థితి గ్రామాల్లో నిత్యకృత్యంగా మారిందని మహిళలు ఆవేదన చెందుతున్నారు.


బహిరంగంగా మద్యం సేవిస్తున్న మందుబాబు (ఫైల్)


పూనూరులో ఆలయం వద్ద నడిరోడ్డుపై తాగి దొర్లుతున్న మందుబాబు (ఫైల్)

**పుట్టగొడుగుల్లా బెల్టు షాపులు..**

నియోజకవర్గంలోని పర్చూరు సెబ్ పరిధిలో యద్దనపూడి, మార్టూరు, పర్చూరు, ఇంకొల్లు మండలాల పరిధిలో మెత్తం 16 మద్యం షాపులు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో వీధికొక బెల్టుషాపులు వెలిశాయి. దీంతో మందుబాబులు ఆలయాలు, బస్‌షెల్టర్లు, రోడ్లవెంబడి, పాఠశాల ఆవరణలు మందుబాబులకు అడ్డాగా మారాయి. దీంతో మహిళలు, చిన్నారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఒకవేళ ఎవరైనా బెల్టుషాపులపై ఫిర్యాదు అందితే వాటిని నియంత్రించకుండా చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అంత సిండికేట్ మయమే..**

వైన్స్ లైసెన్స్ దారులతో సిండికేట్ అయిన కొందరు నేతలు గ్రామాల్లో తమ అనుచరుల ద్వారా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. ఎక్కడిక్కడ అధికార పార్టీ అనుచరులే ఉండటంతో బెల్టును అడ్డుకునే వారే లేకుండా పోయారు. బెల్టు షాపులపై నిఘా పెట్టాల్సిన అధికారులు చోద్యం చూస్తుండటంపై ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక వేళ టార్గెట్ల పేరుతో దాడులు నిర్వహిస్తున్నా నామమాత్రపు మొక్కుబడి కేసులతో సరి పెడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దాడుల్లో పట్టుబడిన మద్యం ఏ షాపు నుంచి వచ్చిందో వాటి మూలాలు కనుక్కొని వారిపై చర్యలు తీసుకోవటం లేదు. ఇప్పటికైనా అధికారులు బెల్టుషాపులకు మూకుతాడు వేస్తారా లేదా తమకు తామే గిరిగీసుకొని చోద్యం చూస్తూ కూర్చుంటారా అని జనం గుసగుసలాడుకుంటున్నారు. బెల్టు నిర్వాహకుల నుంచి అధికారులు మామూళ్లు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**తూతూమంత్రంగా దాడులు..**

ఇటీవల అధికారులు బెల్టుషాపులపై జరిపిన దాడుల్లో 17 కేసులు మాత్రమే నమోదు చేశారు. అక్టోబర్ 25న పెద్ద జాగర్లమూడిలో ఓ వ్యక్తి దగ్గర 45 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. సెప్టెంబర్ 5 ఇంకొల్లులో ఓ వ్యక్తి దగ్గర 7 మద్యం సీసాలు, 8వ తేదీన ఇడుపులపాడులో ఓ మహిళ వద్ద 6 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. 2వ తేదీ చెరుకూరులో 15, 9వ తేదిన పోతుకట్లలో 10, 10వ తేదీ మార్టూరులో అగ్రహారంలో 48, మరో వ్యక్తి నుంచి 14 సీసాలు, 28 వ తేదీ వంకాయలపాడులో 10 సీసాలు, 23 వ తేదీ వీరన్నపాలెంలో భారీ ఎత్తున 51 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. 23వ తేదీ ఇడుపలపాడులో 8, అదే రోజు పోతుకట్లలో 9 సీసాలు, యనమదలలో 8 చింతపల్లిపాడులో 9 , డిసెంబర్‌లో యనమదలలో 9 మద్యం సీసాలు, పూనూరులో 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేశారు.

> **బెల్టుషాపులపై కఠిన చర్యలు..**
> నిబంధనలు అతిక్రమించి మద్యం అనాధికారికంగా విక్రయిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో బెల్టు షాపులు ఏర్పాటు చేస్తే వారి వివరాలను 94409 02491 నంబర్‌కు సమాచారం ఇవ్వాలి. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటాం.
> – భుజంగరావు, సెబ్ సీఐ, పర్చూరు

---

## విజేతలకు బహుమతుల పంపిణీ


విద్యార్థులకు బహుమతులందిస్తున్న దాతలు

చినగంజాం: క్రిస్మస్, నూతన సంవత్సరం పురస్కరించుకొని చినగంజాం అంబేడ్కర్ నగర్‌లోని సండే స్కూల్ విద్యార్థులకు నిర్వహించిన పాటల పోటీలో విజేతలకు డీటీ మేడికొండ స్రవంతి బహుమతులను సమకూర్చగా ఆమె తల్లి రూతమ్మ ఆదివారం అందజేశారు. అదే విధంగా సండే స్కూల్ విద్యార్థులకు మేకల పద్మారావు సతీమణి శాంతకుమారి జ్ఞాపకార్థం సండే స్కూల్ విద్యార్థులకు ఆదివారం ఆతిథ్యం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సండే స్కూల్ నిర్వాహకులు ఎం మేషక్‌బాబు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### అన్నదానం ఎంతో పవిత్రమైనది


మాలధారులకు సద్ది ఏర్పాటు చేసిన నిర్వాహకులు

చీరాల: ఎంతో పవిత్రమైన అయ్యప్ప మాలధారులకు సద్ది ఏర్పాటు చేయడం ఎంతో పుణ్యమని కామాక్షి కేర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ తాడివలస దేవరాజు అన్నారు. అయ్యప్ప స్వాముల భక్త బృందం ఆధ్వర్యంలో ఆదివారం పేరాల శివాలయంలో గత 30 రోజులుగా ప్రతి రోజు అయ్యప్ప, భవాని, శివ దీక్ష తీసుకున్న 200 మందికి సద్ది వితరణ జరుగుతుందన్నారు. ఈసందర్భంగా ఆదివారం ఆయన మాలధారులకు సద్ది ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వామి తులసిరామ్, అయ్యప్ప స్వాములు రంగారావు, శివ, లక్ష్మణ్, లాలు, సతీష్, భాను, హరి మాస్టర్, మాలధారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

### 31న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చీరాల: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఈనెల 31న మంగళవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ ఆదివారం ఒక ప్రటనలో తెలిపారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

### నేడు గర్నెపూడిలో రెవెన్యూ సదస్సు

పర్చూరు (చినగంజాం): మండలంలోని గర్నెపూడి గ్రామంలో నేడు రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పీ బ్రహ్మయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ సమస్యలు ఉన్న వారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఈ సదస్సులో అర్జీలు సమర్పించి భూ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

## కూటమి నేతల ఆధిపత్య పోరు అరికట్టాలి


ఇసుక తవ్వకాలపై విచారణ చేయాలని ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాల నేతలు

చీరాల: ఇసుక తవ్వకాల విషయంలో ఎంపీ, ఎమ్మెల్యే వర్గీయుల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరును అరికట్టి చీరాలలో సహజ వనరులను ప్రభుత్వం సంరక్షించాలని ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. చీరాల మండలం బోయినవారిపాలెంలో జేసీబీ దగ్ధం ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు మాచర్ల మోహనరావు, చుండూరి వాసు మాట్లాడుతూ రాష్ట్రంలో నేడు జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇరువురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో ఇసుక, గ్రానైట్, మైనింగ్ ఇతర సహజవనరులు భారీగా దోపిడికి గురవుతున్నాయన్నారు. చీరాల ప్రాంతంలో భారీగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని, నేతల మధ్య నెలకొని ఉన్న ఆధిపత్య పోరుతో సహజవనరులు దెబ్బతింటున్నాయన్నారు. కార్యక్రమంలో మాచవరపు జూలియన్, గోసాల అశోక్, డి.విజయసుందర్, దామర్ల శ్రీకృష్ణ, చిరంజీవి, జయరాజ్, శామ్యూల్, విమలాకర్, రత్నం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## డివైడర్ దిమ్మెను ఢీకొన్న కారు


దిమ్మెను ఢీకొని దెబ్బతిన్న కారు

మేదరమెట్ల: కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈఘటన కొరిశపాడు మండల పరిధిలోని వెంకటాపురం క్రాస్ రోడ్డు జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. హైవే పోలీసుల వివరాల మేరకు.. ఒంగోలు వైపు నుంచి విజయవాడకు కారులో ఐదుగురు ప్రయాణం చేస్తున్నారు. కారు పీ.గుడిపాడు జాతీయ రహదారి దాటి వెంకటాపురం క్రాస్ రోడ్డు వద్దకు రాగానే కారు అదుపు తప్పి డివైడర్ కోసం ఉంచిన సిమెంటు దిమ్మెను బలంగా ఢీకొంది. దీంతో కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులకు రక్తగాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## పాము కాటుతో మహిళ మృతి

వేటపాలెం: పొలంలో పశువుల మేతకు గడ్డి కోయడానికి వెళ్లిన మహిళను పాముకాటు వేయడంతో మృతి చెందింది. ఈఘటన మండల పరిధిలోని చల్లారెడ్డిపాలెం శివారు పొలాల్లో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన జీ కుమారి (40) తమ పశువులకు పచ్చిగడ్డి కోసుకొని రావడానికి శివారులోని పంట పొలాలకు వెళ్లింది.

గడ్డి కోసే సయంలో గడ్డిలో దాగి ఉన్న పాము మహిళను కాటు వేసింది. సమాచారం అందుకున్న స్థానికులు, కుటుంబ సభ్యులు మహిళను వైద్యశాలకు తరలించగా మృతి చెందింది.

---

# వైద్యమో రామచంద్రా !


పై భాగం పెచ్చులూడిన ఆసుపత్రి గది


గదులు చాలక పక్కన పెట్టిన బెడ్లు

- వసతుల లేమితో మార్టూరు ప్రభుత్వాసుపత్రి
- 30 పడకల ఆసుపత్రిలో ఉన్నది 15 పడకలే
- గైనకాలజిస్టు, ఎక్సరే యూనిట్ లేక రోగుల ఇబ్బందులు

మార్టూరు:

ప్రైవేటు.. ప్రైవేటు.. కార్పొరేటు. ఇది కూటమి ప్రభుత్వం ప్రస్తుతం అనుసరిస్తున్న విధానం. ఈ ఏడు నెలల్లో విద్య, వైద్యం, వ్యవసాయం ఎంత కునారిల్లాయో మనం చూస్తూనే ఉన్నాం. ప్రస్తుతం ప్రభుత్వం ఆరోగ్యశ్రీని నీరుగార్చి ప్రైవేటుపరం చేసేందు పూర్తిగా సన్నద్ధం అవుతుండటంతో పేదల ఆరోగ్యం అంపశయ్య మీద ఉన్నట్లే అని అర్థం అవుతోంది. మార్టూరు జాతీయ రహదారి పక్కన గల 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రికి నిత్యం రోగుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. మండలంలోని 16 గ్రామాల నుంచేకాక పక్క మండలాల నుంచి సైతం ఇక్కడికి ప్రసవాలు ఇతర అనారోగ్య సందర్భాలలో రోగులుగా ఎక్కువగానే వస్తుంటారు. దీనికి తోడు రహదారిపై తరచూ జరిగే రోడ్డు ప్రమాదాల బారిన పడిన వారు సైతం మొదట ఇక్కడే చికిత్స నిమిత్తం వచ్చి పరిస్థితి తీవ్రతను బట్టి గుంటూరు, చిలకలూరిపేట, ఒంగోలు ఆసుపత్రులకు రోగులను తరలిస్తుంటారు. ఇంత రద్దీగా ఉండే 30 పడకల ఆసుపత్రిలో ప్రస్తుతం 15 పడకలు మాత్రమే రోగులకు అందుబాటులో ఉండే పరిస్థితి ఏర్పడటంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**పెచ్చులూడుతున్న భవనాలు..**

రెండు భాగాలుగా నిర్మాణం జరుపుకున్న ఈ ఆసుపత్రి మొదటి భాగం సుమారు రెండున్నర దశాబ్దాల క్రితం నిర్మించారు. ఈభవనంలో పెచ్చులూడి కింద పడుతుండటంతో రోగులకు ప్రమాదంగా మారుతున్నాయి. గత ఎనిమిది నెలలుగా ఆసుపత్రి ముందు భాగాన్ని మూసివేసి వెనుక భాగంలోనే నిర్వహించడం గమనార్హం. ఆసుపత్రి రెండో భాగం అయిన వెనుక భాగం సుమారు 10 ఏళ్ల క్రితం రూ.2.70 కోట్ల వ్యయంతో నిర్మించినది కావడంతో ప్రస్తుతం ఆసుపత్రి నిర్వహణ అంతా అక్కడే నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో 30 పడకలు ఏర్పాటు చేసే గదులు లేకపోవడంతో 15 పడకలను పక్కనపెట్టి మిగిలిన 15 పడకలతోనే ఆసుపత్రి నిర్వహణ జరగడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**గైనకాలజీ వైద్యులు లేక..**

అంతేకాక ఆసుపత్రిలో గత ఆరు నెలలుగా గైనకాలజీ వైద్యులు లేకపోవడంతో గర్భిణులు ప్రసవ సమయాల్లో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. గత రెండేళ్లుగా రేడియాలజీ విభాగానికి చెందిన సిబ్బందికి వేతనాలు అయితే చెల్లిస్తున్నారు కాని ఎక్స్ రే యూనిట్ అందుబాటులో లేకపోవడం గమనార్హం. ఇక పోస్టుమార్టం నిర్వహించే గదిని చూస్తే నరకం కనిపిస్తుందని శవ పరీక్షల సమయంలో వచ్చిన మృతుల తాలూకు బంధువులు చెప్పడాన్ని బట్టి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల ఓ మహిళా రోగికికు అవసరమైన ప్లాస్టర్ ఆసుపత్రిలో అందుబాటులో లేకపోవడంతో ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్ రోగి వద్ద రూ.200 వసూలు చేసి బయట నుంచి తెప్పించారు. ఆసుపత్రి నిర్వహణలోని లోపాలను సవరించి అవసరమైన మందులు, పరికరాలు అందుబాటులో ఉంచి 30 పడకలు పూర్తిగా అందుబాటులో ఉండేలా ఆసుపత్రిని పునర్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.


30 పడకల మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రి

> **మరమ్మతులు చేసి పునర్ నిర్మిస్తాం..**
> 
> గతంలో నిర్మించిన ఆసుపత్రి ముందు భాగం శిథిలావస్థకు చేరటంతో ముందు భాగాన్ని ఖాళీ చేసి వెనుక భాగంలో నిర్వహిస్తున్న మాట నిజమే. ప్రస్తుతం రేపల్లె ప్రభుత్వాసుపత్రికి మరమ్మతులు చేయిస్తున్నాం అది పూర్తికాగానే మార్టూరు ఆసుపత్రికి ప్రస్తుతం మరమ్మతులు చేయిస్తాం. వచ్చే 16వ ఆర్థిక సంఘం నిధులతో ఆసుపత్రిని పునర్ నిర్మిస్తాం.
> – శేషుకుమార్, జిల్లా వైద్యాధికారి, వైద్య విధాన పరిషత్

### మంచి అలవాట్లతో ఆరోగ్యకర జీవితం


సుబ్బరామయ్యను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

వేటపాలెం: మంచి అలవాట్లు ఆరోగ్యకర జీవితానికి దోహదపడతాయని విశ్రాంత వ్యవసాయ శాఖ అడ్మినిస్ట్రేటివ్ అధికారి బుద్ధి సుబ్బరామయ్య పేర్కొన్నారు. రైల్వేస్టేషన్ రోడ్డులో గల రోటరీ కమ్యూనిటీ హాల్లో ప్రోబస్ క్లబ్ సమావేశం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆయన రాసిన స్వీయ కవితలైన తెలుగు అక్షరమాలు, జీవి, జీవితం, నడక, నడత, మద్యం, జవాన్, కిసాన్ తదితర విషాయలపై వివరించారు. అనంతరం ఆయనను క్లబ్ సభ్యులు దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఆవుల పున్నయ్య, కార్యదర్శి బీరక సుబ్రహ్మణ్యం, కోశాధికారి బొడ్డు కోటేశ్వరరావు, వలేటి సుబ్బారావు, నాయని సత్యనారాయణ, కర్ణ సుబ్బారావు, ఎస్ఎం షరీఫ్, పమిడయ్య పాల్గొన్నారు.

### పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ అమ్మవారు

చీరాల టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన తోటవారిపాలెం పోలేరమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. బాపట్ల, ప్రకాశం, గుంటూరు, పల్నాడు జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామాన్ని సుభిక్షంగా ఉంచడంతో పాటుగా కోరిన కోర్కెలు తీర్చే పోలేరమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి తమ మొక్కులు చెల్లించుకున్నారు.